సాక్షి రంగారెడ్డి

బుధవారం । 20 । ఆగస్టు । 2025



అవినీతి జలగలు!

ఎప్పటికప్పుడు ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకుంటున్నా అక్రమార్కుల ఆగడాలు మాత్రం ఆగడం లేదు. 8లో ▸



కేబుల్ వైర్లు కట్

విద్యుత్ స్తంభాలకు వేలాడుతూ మృత్యుపాశాలుగా స్టార్ కేబుళ్లు, ఇంటర్నెట్ కేబుళ్ల తొలగింపు ప్రక్రియ కొనసాగుతోంది. 8లో ▸



భలే మంచి బేరం

వివిధ చోట్ల ఉన్న ప్రభుత్వ భూములను వేలం వేసేందుకు హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ ఏర్పాట్లు చేపట్టింది. 8లో ▸

న్యూస్‌రీల్

మహ్మద్‌నగర్‌వాసికి జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎండీ ఆసిఫ్‌జానీ

కందుకూరు: భారత్‌కే అన్మోల్ 2025 ఢిల్లీ ఎడిషన్ జాతీయ అవార్డును మండల పరిధిలోని మహ్మద్‌నగర్‌కు చెందిన సినీ నిర్మాత (స్టార్ ఫిల్మ్ ఫ్యాక్టరీ) ఎండీ ఆసిఫ్‌జానీ అందుకున్నారు. కానిస్ట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్–మాదకద్రవ్య రహిత భారతదేశం ఒక మైలురాయి అన్న అంశంపై సోమవారం రాత్రి ఢిల్లీలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియా క్రికెట్ మాజీ కెప్టెన్ అజహరుద్దీన్, కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ ఠాకూర్ చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. మాదకద్రవ్యాల నివారణపై అవగాహన కల్పిస్తున్నందుకు ఈ అవార్డు వరించింది.

వృక్షశాస్త్రంలో గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్‌తో శ్రీవాణి

కడ్తాల్: మండల కేంద్రానికి చెందిన శ్రీవాణి వృక్ష శాస్త్రంలో గోల్డ్‌మెడల్ సాధించింది. ఉస్మానియా యూనివర్సిటీలో 2022–24 విద్యా సంవత్సరంలో ఆమె బోటనీ సబ్జెక్ట్‌గా పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. యూనివర్సిటీ స్నాతకోత్సవం సందర్భంగా మంగళవారం వర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ అందుకుంది. శ్రీవాణి గోల్డ్ మెడల్ సాధించడంపై గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, పలువురు నాయకులు అభినందించారు.

కూరగాయల సాగుపై రైతులకు అవగాహన



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ అధికారి సురేష్

యాచారం: మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో మంగళవారం కూరగాయల పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ, కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు కూరగాయల సాగుపై అవగాహన కల్పించారు. ఏ సీజన్‌లో ఏవి సాగు చేయాలి, మార్కెట్‌కు తరలింపు, విత్తనాలు, నార్ల ఎంపిక తదితర విషయాలపై అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ అధికారి బసవన్నప్ప వివరించారు. ఆధునిక పద్ధతుల్లో కూరగాయల పంటలు సాగు చేస్తే అధిక దిగుబడితో మంచి లాభాలు వస్తాయని జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ అధికారి సురేష్ తెలిపారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి రవినాథ్, రుక్మిణి, రాధ తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాతో అధిక దిగుబడులు



ఈపాస్ యంత్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి

షాద్‌నగర్: రైతులు నానో యూరియాను వాడి తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందొచ్చని అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని పరిగి రోడ్డులో ఉన్న మన గ్రోమోర్ ఎరువుల గోదామును మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో ఎరువుల నిల్వలు, వాటికి సంబంధించిన రికార్డులు, ఈపాస్ యంత్రాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. రైతులకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, రైతులు అపోహలు నమ్మొద్దని సూచించారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు రమాదేవి, మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్, ఏఓ టెక్నికల్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట: కొండారెడ్డిపల్లి శివారులో అలుగు పారుతున్న పెద్ద చెరువు



షాబాద్: అలుగు పొంగి ప్రవహిస్తున్న పహిల్వాన్ చెరువు

జోరుగా వానలు

ఏకధాటిగా కురుస్తున్న వర్షాలు

- కళకళలాడుతున్న వాగులు, చెరువులు
- నీట మునిగిన పంటలతో రైతుల ఆందోళన
- ఛిద్రమైన రహదారులతో ప్రయాణికుల పాట్లు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: కొద్ది రోజులుగా జిల్లాలో ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు అలుగు పారుతున్నాయి. కుంటలు నిండుకుండలను తలపిస్తున్నాయి. ఈదురు గాలులకు పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. విద్యుత్ వైర్లు తెగిపడి సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

- వర్షాలతో పంటలు నీట మునిగిపోయాయి. వరి, కంది, మొక్కజొన్న, పత్తి పంటలు దెబ్బ తిన్నాయి. అప్పులు చేసి పెట్టిన తమకు పెట్టుబడులు చేతికందుతాయో లేదోనని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.
- నాలుగైదు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి రహదారులు ఛిద్రమైపోయాయి. ఎక్కడ చూసినా గుంతలు తేలి, పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలిచింది. రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- మంగళవారం కురిసిన వర్షానికి ఇళ్లకు వెళ్లే విద్యుర్థులు, ప్రైవేటు ఉద్యోగులు, పనులకు వెళ్లి తిరిగి వచ్చేవారు ఇబ్బందులు పడ్డారు.



నందిగామ: నర్సప్పగూడ శివారులో వంగ తోటలో నిలిచిన వర్షం నీరు



కొందుర్గు: ముట్పూర్‌లో దెబ్బతిన్న పత్తిపంట



శంకర్‌పల్లి: శంకర్‌పల్లి- చేవెళ్ల ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతల్లో ప్రయాణికుల అవస్థలు

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మంచాల: పంచాయతీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన మండలకు సభకు హాజరైన ఆయన మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు అందించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని అన్నారు. అర్హత గల వారిని పర్మినెంట్ చేయాలని, విద్యార్హతను బట్టి బిల్ కలెక్టర్లు, కారోబార్లుగా పదోన్నతి కల్పించాలన్నారు. మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని కోరారు. విధి నిర్వహణలో మరణిస్తే సిబ్బంది కుటుంబానికి రూ.10 లక్షలు నష్ట పరిహారం అందించాలని, పీఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా గ్రాంట్ చెల్లించాలని డిమాండ్ చేశారు. దహన సంస్కారాల కోసం ఇస్తున్న రూ.10 వేలను రూ.20 వేలకు పెంచాలని కోరారు.ఇచ్చే చాలీచాలని వేతనాలు కూడా పెండింగ్‌లో పెట్టడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ, పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు డి.భాస్కర్, ప్రధాన కార్యదర్శి జాపాల జంగయ్య, కోశాధికారి రవి, ఉపాధ్యక్షులు మాధవి, శంకరయ్య, కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

మహా గణపతి తొలి పూజకు హాజరు కానున్న గవర్నర్

ఖైరతాబాద్: మహాగణపతి తొలి పూజకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరు కానున్నారని ఎమ్మెల్యే, ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ హడ్‌హక్ కమిటీ కన్వీనర్ దానం నాగేందర్ తెలిపారు. మహాగణపతిని ఈనెల 30న యూఎస్ కాన్సులేట్ జనరల్ సందర్శించుకోనున్న నేపథ్యంలో యూఎస్ కౌన్సిల్ ప్రతినిధి బృందం మంగళవారం మండపాన్ని సందర్శించి పరిస్థితులను పర్యవేక్షించారు. ప్రతినిధి బృందానికి దానం నాగేందర్ మహాగణపతి విశేషాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 27న వినాయక చవితి సందర్భంగా మహాగణపతి తొలి పూజకు గవర్నర్ హాజరవుతారని, సీఎం రేవంత్‌రెడ్డి కూడా వచ్చే అవకాశముందని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హడ్‌హక్ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, సందీప్ రాజ్, మహేశ్ యాదవ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టళ్లలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

ఇబ్రహీంపట్నం: స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో సివిల్ సప్లయ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. బియ్యం నిల్వలు స్టాక్, సప్లయ్‌కి సంబంధించిన వివారాలను అడిగి తెలుసుకున్నారు. వంట గది, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం సివిల్ సప్లయ్ టాస్క్‌ఫోర్స్ డీఎస్పీ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ అండ్ కాలేజీల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ సీఐ అజయ్‌బాబు, ఎస్‌ఐ కృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ, గురుకుల ప్రిన్సిపల్ శ్రీరామ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ గురుకుల పాఠశాలలో వంట గదిని పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

గ్రాంటు రాక.. ఖర్చు చేయలేక!

- పాఠశాలలకు విడుదల కాని నిధులు
- చాక్‌పీసులు, డస్టర్లు, చీపుర్లకూ కరువే..
- జేబు నుంచి వెచ్చిస్తున్న ఉపాధ్యాయులు

కేశంపేట: బడులు తెరిచి రెండు నెలలు దాటినా పాఠశాల గ్రాంట్లు విడుదల కాలేదు. దీంతో ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యుత్ బిల్లుల చెల్లింపు, చాక్‌పీసులతోపాటు డస్టర్లు, స్టేషనరీ కొనుగోలుకు తమ జేబుల్లోంచి వెచ్చిస్తున్నారు. గతంలో పాఠశాల ప్రారంభంలోనే గ్రాంట్లు విడుదల చేసేవారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 1,300 పాఠశాలలు ఉన్నాయి. అన్ని స్కూళ్లకు ఇప్పటికీ నిధులు విడుదల కాకపోవడంతో ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులతో కలిసి సమకూర్చుకుంటున్నారు.

విద్యార్థుల సంఖ్యను బట్టి..

పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్యను బట్టి ప్రభుత్వం రెండు రకాలుగా గ్రాంట్లు విడుదల చేస్తోంది. పాఠశాల గ్రాంటు, స్పోర్ట్స్ గ్రాంటు రూపంలో ఇస్తోంది. ఈ నిధులను పాఠశాల అకౌంట్‌లో జమ చేస్తుంది. వీటిని అవసరాల మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో పాటు సీనియర్ ఉపాధ్యాయుడు సంయుక్తంగా చెక్కుపై సంతకం చేసి డ్రా చేస్తారు. పాఠశాల గ్రాంటు నుంచి కరెంట్ బిల్లులు చెల్లించడం, మరుగుదొడ్ల పరిశుభ్రత, చాక్‌పీసులు, డస్టర్లు, స్టేషనరీలాంటివి కొనుగోలు చేస్తారు. స్పోర్ట్స్ గ్రాంటు నుంచి విద్యార్థుల కోసం క్రీడాసామగ్రి కొనుగోలుకు వెచ్చిస్తారు.



నిధులు ఇలా (రూపాయల్లో..)

పిల్లల సంఖ్య	పాఠశాల గ్రాంట్	స్పోర్ట్స్ గ్రాంట్
1-15	10,000	5,000
16-100	25,000	5000
101-250	50,000	5000
251-1000	75,000	10,000

గ్రాంట్లను పెంచి ఇవ్వాలి



కొన్నేళ్లుగా ఇస్తున్న గ్రాంట్లను పెంచి ఇవ్వాలి.గతంలో చాక్‌పీసులు,డస్టర్ల ధరలకు అనుగుణంగా ప్రభుత్వం విడుదల చేసేది. ప్రస్తుతం వాటి ధరలు భారీగా పెరిగినందున పెరిగిన ధరలకు అనుగుణంగా గ్రాంట్లు పెంచి, త్వరగా అందించాలి.

– అస్కాని శ్రీనివాససాగర్, పీఆర్టీయూ నాయకుడు

త్వరలో విడుదల కావొచ్చు



పాఠశాలలో విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేస్తున్నాం. ఈ ప్రక్రియ త్వరలో పూర్తవుతుంది. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యపై స్పష్టత వచ్చిన తర్వాత నిధుల విడుదల జరగొచ్చు.

– చంద్రశేఖర్, మండల విద్యాధికారి, కేశంపేట

ముగిసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ

- బాలుర విభాగంలో విజేత భద్రాద్రి కొత్తగూడెం జట్టు
- బాలికల విభాగంలో నిజామాబాద్ జట్టుకు ప్రథమ స్థానం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సమీపంలోని గురుకుల విద్యాపీఠ్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్–15 బాలుర, బాలికల వాలీబాల్ పోటీలు మంగళవారంతో ముగిసాయి. బాలుర విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం ప్రథమ స్థానంలో, రంగారెడ్డి ద్వితీయ స్థానంలో, మంచిర్యాల తృతీయ స్థానంలో నిలిచాయి. బాలికల విభాగంలో ప్రథమ స్థానం నిజామాబాద్, ద్వితీయ స్థానం సూర్యాపేట, తృతీయ స్థానం నారాయణపేట జిల్లాలు దక్కించుకున్నాయి. విజేతలకు షీల్డ్‌లు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి హీర్యానాయక్, గురుకుల విద్యాపీఠం ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్‌రావు, పీఈటీల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవరెడ్డి, పీఈటీలు, పీడీలు నాగరాజు, సుధాకర్, షబ్బీర్, చెన్నకిష్టారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుధాకర్, రవికుమార్, బస్వరాజ్, మల్లేష్, బాబయ్య, వెంకటేశ్, శ్రీలత, జోనల్ సెక్రటరీ పీడీ సుశీల తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందుకున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జట్టు

సాదాసీదాగా ముగింపు

రాష్ట్ర స్థాయిలో 32 జిల్లాల క్రీడాకారులు పాల్గొన్న వాలీబాల్ టోర్నీ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎవరూ హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. సాదాసీదాగా కార్యక్రమం ముగించడంతో క్రీడాకారులు నిరుత్సాహానికి గురయ్యారు.

నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యం



మహిళా సంఘాల సభ్యులకు చెక్కు అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

తుర్కయంజాల్: వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడమే బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన ఉద్దేశమని బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజీవ్ మిశ్రా తెలిపారు. భారత ప్రభుత్వం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆర్థిక సేవల విభాగం ఆదేశాల మేరకు మంగళవారం పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రామ స్థాయి జన సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదలు, బలహీన వర్గాలు, అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం పలు మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణాలు పంపిణీ చేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా ఇంజాపూర్ ఉన్నత పాఠశాలకు చెక్కు, సౌండ్ సిస్టం అందజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ జనరల్ మేనేజర్ మనోజ్ కుమార్ శ్రీ వాత్సవ, తెలంగాణ జోనల్ అధికారి ముఖేష్ కుమార్ పాల్గొన్నారు.

నూనె గింజల సాగుతో మంచి రాబడి

- భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ మతూర్

షాబాద్: నూనె గింజల సాగుతో రైతులకు మంచి ఆదాయం వస్తుందని భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ డైరెక్టర్ మతూర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని రేగడిదోస్వాడలో మంగళవారం భారతీయ నూనె గింజల పరిశోధనా సంస్థ రాజేంద్రనగర్ ఆధ్వర్యంలో నూనె గింజల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక పథకంలో భాగంగా నూనె తీసే యంత్రాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. అధిక దిగుబడినిచ్చే విత్తనాలు అభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, యాంత్రీకరణ తదితర అంశాలపై విస్తృతంగా పరిశోధనలు చేస్తున్నట్లు చెప్పారు. సేవా స్ఫూర్తి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వొంగూరు విజయ్ భాస్కర్‌రెడ్డి, సీఈవో చందన షెడ్యూల్ కులాల ఉప పథకం ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ రత్నాకర్, సుగుణ మాల రైతు ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడు లింగం, సంఘం సభ్యులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న మతూర్

డ్రోన్ టెక్నాలజీని వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి ఉష

అబ్దుల్లాపూర్‌మెట్: కూలీల కొరతను అధిగమించేందుకు రైతులు డ్రోన్ టెక్నాలజీని వినియోగించుకునేందుకు ముందుకు రావాలని జిల్లా వ్యవసాయాధికారి ఉష సూచించారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ×పాత మామిడి తోటల పునరుజ్జీవనం–వాతావరణ బులిటిన్– డిజిటల్ వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ వినియోగం≀ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. తెగుళ్ల నివారణకు పురుగు మందు పిచికారీకి డ్రోన్ స్ప్రేలను వినియోగించుకోవాలని శాస్త్రవేత్తలు సూచించినట్లు తెలిపారు. తక్కువ సమయంలో ఎక్కువ ఎకరాలకు పిచికారీ చేయొచ్చని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఐ.పల్లవి, వ్యవసాయ విస్తరణాధికారి ఎస్.రఘు పాల్గొన్నారు.

ఫిజిక్స్‌లో విద్యారాణికి పీహెచ్‌డీ పట్టా



పట్టా అందుకున్న విద్యారాణి



డాక్టరేట్‌ను అందుకుంటున్న సంధ్యారాణి

షాద్‌నగర్‌రూరల్‌: ఫిజిక్స్‌లో 'వేరియబుల్‌ అపోడైజేషన్‌ రీసెర్చ్‌ గైడ్‌ ఆప్టికల్‌ ఇమేజింగ్‌ సిస్టం'పై చేసిన పరిశోధనకు గాను షాద్‌నగర్‌ పట్టణంలోని ఎన్జీఓస్‌ కాలనీకి చెందిన ఎస్‌.విద్యారాణికి ఉస్మానియా యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. విద్యారాణి ప్రొఫెసర్‌ కరుణసాగర్‌ నేతృత్వంలో పరిశోధన చేసి గ్రంథాన్ని సమర్పించింది. ఈ సందర్భంగా మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీ 84వ స్నాతకోత్సవంలో గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ, ఇస్రో చైర్మన్‌ నారాయణన్‌, వీసీ ప్రొఫెసర్‌ కుమార్‌ మొలుగారం చేతుల మీదుగా పట్టా అందుకున్నారు. ప్రస్తుతం ఆమె మహబూబ్‌నగర్‌ జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్‌ కళాశాలలో ఫిజిక్స్‌ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు.

డాక్టరేట్‌ అందుకున్న సంధ్యారాణి

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ షాద్‌నగర్‌ డివిజన్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న సంధ్యారాణి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్‌ అందుకున్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా గంగపుత్ర కమ్యూనిటీలో మహిళా సాధికారత అంశంపై అసోసియేటెడ్‌ ప్రొఫెసర్‌ ధీరజ్‌ పర్యవేక్షణలో ఆమె పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్‌ నారాయణన్‌, యూనివర్సిటీ వీసీ కుమార్‌ మొలుగారం చేతుల మీదుగా డాక్టరేట్‌ అందుకున్నారు.

ఐదుగురు అధ్యాపకులకు డాక్టరేట్‌

హయత్‌నగర్‌: హయత్‌నగర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న లెక్చరర్లు అవేష్‌ మోహియుద్దీన్‌, మధు, మక్ల, యాదగిరిరెడ్డి, నాగరాజు డాక్టరేట్‌ అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌ సురేష్‌బాబు తెలిపారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం ఠాగూర్‌ ఆడిటోరియంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఇస్రో చైర్మన్‌ డాక్టర్‌ నారాయణన్‌, వీసీ కుమార్‌ చేతుల మీదుగా డాక్టరేట్‌ అందుకున్నారు. భౌతిక శాస్త్రంలో పరిశోధనలు చేసినందుకు గాను అవేష్‌ మోహియుద్దీన్‌, మధుకు, రాజనీతి శాస్త్రంలో పరిశోధనలకు యాదగిరిరెడ్డి, నాగరాజులకు, ఇంగ్లిష్‌లో పరిశోధనలకు మక్లకు దక్కాయి.

సాంకేతిక సమస్యలతో తిరుపతి విమానం రద్దు

శంషాబాద్‌: సాంకేతిక సమస్యలతో తిరుపతి విమానం రద్దు చేశారు. శంషాబాద్‌ విమానాశ్రయం నుంచి మంగళవారం ఉదయం 5.55 గంటలకు 53 మంది ప్రయాణికులతో అలయన్స్‌ ఎయిర్‌లైన్స్‌కు చెందిన 91877 విమానం తిరుపతికి బయలుదేరేందుకు సిద్ధమైంది. విమానంలో టేకాఫ్‌ తీసుకునే ముందు సాంకేతిక సమస్యను గుర్తించిన పైలట్‌ విమానాన్ని నిలిపివేశారు. కొన్ని గంటల తర్వాత విమానాన్ని రద్దు చేసినట్లు ఎయిర్‌లైన్స్‌ వర్గాలు ప్రయాణికులకు వెల్లడించారు.

అమ్మ మందలించిందని

- ఇంట్లోనుంచి వెళ్లిన బాలుడు
- తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



బాలున్ని తల్లిదండ్రులకు అప్పగించిన పట్నం పోలీసులు

ఇబ్రహీంపట్నం: తల్లి మందలించడంతో అలిగి ఇంట్లో నుంచి వెళ్లిన బాలున్ని ఇబ్రహీంపట్నం పోలీసులు క్షేమంగా అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. దేవరకొండకు చెందిన విజయకుమారి, హరిష్‌ దంపతులు అబ్దుల్లాపూర్‌మెట్‌ మండలం బ్రాహ్మణపల్లిలో నివాసం ఉంటున్నారు. వీరి కొడుకు తుర్కయంజాల్‌ కాకతీయ స్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. చిన్న విషయంలో అమ్మ మందలించిందనే కారణంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. తుర్కయంజాల్‌ నుంచి ఇబ్రహీంపట్నం చెరువు కట్ట వద్ద నడుచుకుంటూ వెళ్తుండగా పోలీసుల కంటపడ్డాడు. అతన్ని ఆరా తీసి, పీఎస్‌కు తీసుకెళ్లి తల్లిదండ్రులను పిలిచి అప్పగించారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం

తాండూరు టౌన్‌: తాండూరు ఫొటో అండ్‌ వీడియోగ్రఫీ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈమేరకు స్థానిక వినాయక్‌ చౌక్‌లో ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్‌ డాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఒక ఫొటో అనేక పాత, మధుర జ్ఞాపకాలను గుర్తుకు తెస్తుందని తెలిపారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌ అధ్యక్షుడు నరేష్‌, ఉపాధ్యక్షుడు షాబుద్దీన్‌, హీరాలాల్‌, జగదీశ్వర్‌ పాల్గొన్నారు.

అవినీతి జలగలు!

ఏసీబీకి వరుసగా పట్టుబడుతున్న అధికారులు

- ఆర్‌ఐ మొదలు తహసీల్దార్లు, అదనపు కలెక్టర్ల వరకు
- తరచూ వెలుగు చూస్తున్న ఘటనలు
- అయినా మారని తీరు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: జిల్లా ప్రజలను అవినీతి జలగలు పట్టిపీడిస్తున్నాయి. ఎప్పటికప్పుడు ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకుంటున్నా.. కేసులు నమోదు చేసి జైళ్లకు పంపిస్తున్నా అక్రమార్కుల ఆగడాలు మాత్రం ఆగడం లేదు. ప్రతి పనికి ఓ రేట్‌ ఫిక్స్‌ చేసి బలవంతపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఆర్థికాభివృద్ధి, తలసరి ఆదాయంలో దేశంలోనే నంబర్‌ వన్‌ స్థానంలో ఉన్న జిల్లా.. అవినీతి కేసుల్లోనూ అదే రికార్డును కొనసాగిస్తోంది. అడ్డదారుల్లో జిల్లాకు రావడం, ఆ తర్వాత ఫోకల్‌ పోస్టుల్లో తిష్టవేయడం, పెట్టిన పెట్టుబడిని తిరిగి సంపాదించుకునే క్రమంలో ఏసీబీకి పట్టుబడుతుండటం పరిపాటిగా మారింది. పారదర్శకత, అవినీతి నిర్మూలనకు పెద్దపీట వేయాల్సిన ఉన్నతాధికారులు సైతం ఏసీబీ కేసుల్లో పట్టుబడుతుండటం ఆందోళన కలిగిస్తోంది. కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్‌, ఇబ్రహీంపట్నం, తలకొండపల్లి తహసీల్దార్‌ కార్యాలయాల్లో వెలుగు చూసిన అవినీతి చేపల ఘటనను ఇంకా పూర్తిగా మరిచిపోకముందే తాజాగా ఆమనగల్లు తహసీల్దార్‌ కార్యాలయంలో మరో రెండు భారీ చేపలు ఏసీబీ వలకు చిక్కడం గమనార్హం.


రెండు నెలల క్రితం ఏసీబీకి చిక్కిన తలకొండపల్లి తహసీల్దార్‌ నాగార్జున

మచ్చుకు కొన్ని..

- పాసుబుక్‌లో జెండర్‌ సవరణ కోసం జూలై 29న రూ.50 వేలు తీసుకున్న ఆమనగల్లు తహసీల్దార్‌ లలిత, సర్వేయర్‌ రవి తాజాగా మరో రూ.లక్ష డిమాండ్‌ చేసి మంగళవారం ఏసీబీకి చిక్కారు.
- నిషేధిత జాబితాలో ఉన్న భూమిని పట్టా భూమిగా మార్చేందుకు రూ.12 లక్షలు డిమాండ్‌ చేసిన ఘటనలో మే 28న ఇబ్రహీంపట్నం ఆర్‌ఐ కృష్ణను ఏసీబీ అరెస్ట్‌ చేసింది. తర్వాత 12 గంటల పాటు తహసీల్దార్‌ ఆఫీసులో తనిఖీలు చేసింది.
- గత ఆగస్టులో నిషేధిత జాబితాలోని 14 గుంటల భూ వ్యవహారంలో గుర్రంగూడకు చెందిన బాధితుడు ముత్యంరెడ్డి నుంచి రూ.8 లక్షలు లంచం తీసుకుంటూ అప్పటి అదనపు కలెక్టర్‌ (రెవెన్యూ) ఎంవీ భూపాల్‌రెడ్డి సహా సీనియర్‌ అసిస్టెంట్‌ మదన్‌మోహన్‌రెడ్డి ఏసీబీకి చిక్కారు.
- భూమి పేరు మార్పిడీ వ్యవహారంలో రూ.50 వేలు తీసుకుంటూ జూలై 1న తలకొండపల్లి తహసీల్దార్‌ నాగార్జున సహా వీఆర్‌ఏ యాదగిరి పట్టుబడ్డారు. ఇద్దరినీ అరెస్ట్‌ చేసి జైలుకు పంపారు.
- గత మే 31న నెక్నంపూర్‌లోని ఓ నిర్మాణానికి నిరంభ్యంతర పత్రం జారీ కోసం రూ.2.50 లక్షలు డిమాండ్‌ చేసిన నీటిపారుదలశాఖ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ బన్సీలాల్‌ సహా గండిపేట మండల సర్వేయర్‌ పి.గణేశ్‌ అసిస్టెంట్‌ ఇంజనీర్‌ కార్తీక్‌, ఎస్సీ ఆఫీసులోని ఏడబ్ల్యూ సెక్షన్‌ ఏఈ నిఖేష్‌కుమార్‌ ఏసీబీ కేసులో అరెస్టై జైలుకు వెళ్లారు.
- గొర్రెల పథకం స్కాంలో సంబంధం ఉన్న జిల్లా పశువైద్య శాఖ అధికారి అంజలప్ప సహా అప్పటి భూగర్భ జలవనరులశాఖ అధికారి రఘుపతిరెడ్డి సైతం ఏసీబీ కేసులో అరెస్టై, తర్వాత విడుదలయ్యారు.
- గోపన్‌పల్లిలోని ఓ నిర్మాణానికి ట్రాన్స్‌ఫార్మర్‌, సీటీ మీటర్‌ జారీ కోసం రూ.50 వేలు డిమాండ్‌ చేసిన గచ్చిబౌలి ఏడీఈ సతీష్‌ను ఏసీబీ పోలీసులు అరెస్టు చేశారు. ఆయన ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించారు.
- మంచాల మండలంలోని ఓ వెంచర్‌లో రోడ్డుకు అడ్డుగా ఉన్న 11కేవీ, 33 కేవీ లైన్‌ షిఫ్టింగ్‌ కోసం రూ.18 వేలు లంచంగా తీసుకుంటూ సరూర్‌నగర్‌ సర్కిల్‌ ఎలక్ట్రికల్‌ డీఈ (టెక్నికల్‌) టి.రామ్మోహన్‌ ఏడాది క్రితం ఏసీబీకి పట్టుబడ్డారు.

రెడీ మిక్స్‌ ప్లాంట్‌ సీజ్‌



కుంట్లూర్‌లో రెడీమిక్స్‌ ప్లాంట్‌ సీజ్‌ చేస్తున్న మున్సిపల్‌ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్‌: పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని కుంట్లూర్‌ సర్వేనంబర్‌ 177లో ఎలాంటి అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన రెడీమిక్స్‌ ప్లాంట్‌ను మంగళవారం మున్సిపల్‌, పొల్యూషన్‌ కంట్రోల్‌ బోర్డు అధికారులు, పోలీసులు సీజ్‌ చేశారు. మున్సిపల్‌తో పాటు అన్ని అనుమతులు తీసుకున్న తర్వాతే ప్లాంటును నిర్వహించాలని లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని కమిషనర్‌ రవీందర్‌రెడ్డి హెచ్చరించారు.

భలే మంచి బేరం

అమ్మకానికి తుర్కయంజాల్‌, బాచుపల్లి లేఅవుట్లలో ప్లాట్లు

- రెండు చోట్ల 82 ప్లాట్లు విక్రయానికి సిద్ధం
- మరో 11 ప్రాంతాల్లోనూ సన్నాహాలు
- దశలవారీగా ఆన్‌లైన్‌ బిడ్డింగ్‌కు హెచ్‌ఎండీఏ చర్యలు



సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వ స్థలాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. వివిధ చోట్ల ఉన్న ప్రభుత్వ భూములను వేలం వేసేందుకు హైదరాబాద్‌ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) ఏర్పాట్లు చేపట్టింది. గతంలో ఉప్పల్‌, కోకాపేట్‌, బుద్వేల్‌, హయత్‌నగర్‌, బోడుప్పల్‌, బుద్వేల్‌ తదితర ప్రాంతాల్లో విజయవంతంగా ఆన్‌లైన్‌ బిడ్డింగ్‌ నిర్వహించి ప్రభుత్వానికి భారీ ఆదాయాన్ని తెచ్చిపెట్టిన సంగతి తెలిసిందే. ఈ మేరకు తాజాగా హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలోనే ప్రభుత్వ స్థలాలను విక్రయించేందుకు సర్కార్‌ పచ్చజెండా ఊపింది. దీంతో పలు ప్రాంతాల్లో హెచ్‌ఎండీఏ లేవుట్లను పూర్తి చేసినప్పటికీ.. వాటిని వేలం వేసేందుకు అధికారులు సర్కార్‌ ఆమోదం కోసం ఎదురు చూశారు. ఈ మేరకు కొద్ది రోజుల క్రితమే హెచ్‌ఎండీఏ అధికారులు సన్నాహాలు చేపట్టారు. మొద టి విడతగా సెప్టెంబర్‌ మొదటి వారంలో తుర్కయంజాల్‌, బాచుపల్లిలోని 82 ప్లాట్లను విక్రయించనున్నారు. ఆ తర్వాత మిగతా స్థలాలను అమ్మకానికి పెట్టనున్నారు. ప్రస్తుతం రియల్‌ రంగానికి సానుకూలమైన వాతావరణం ఉండడంతో అమ్మకానికి ఇదే అదనుగా భావిస్తున్నట్లు సమాచారం.

అనూహ్య స్పందన

ఇటీవల హౌసింగ్‌బోర్డు నిర్వహించిన ఆన్‌లైన్‌ బిడ్డింగ్‌కు కొనుగోలుదారుల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఈ క్రమంలో హెచ్‌ఎండీఏ స్థలాలకు సైతం మధ్యతరగతి, ఉన్నత ఆదాయవర్గాల నుంచి మంచి స్పందన ఉంటుందని అంచనా వేస్తున్నారు. గతంలో వివిధ చోట్ల నిర్వహించిన బిడ్డింగ్‌కు ఎన్నారైలు భారీ స్పందించారు. కోకాపేట్‌, బుద్వేల్‌ వంటి ప్రాంతాల్లో హెచ్‌ఎండీఏ నిర్ణయించిన ధరల కంటే రెట్టింపు ధరల్లో అమ్ముడయ్యాయి. ప్రస్తుతం బైరామల్‌గూడ, కోకాపేట్‌, చందానగర్‌, పుప్పాలగూడ, బౌరంపేట్‌, చెంగిచెర్ల, సూరారంలలో మొత్తం 11 చోట్ల ఉన్న స్థలాలను విక్రయించనున్నట్లు అధికారులు తెలిపారు.

త్వరలో బిడ్డింగ్‌ నిర్వహించనున్న ప్లాట్‌లు..

లే అవుట్‌	సర్వే నంబర్‌	ప్లాట్ల సంఖ్య
తుర్కయంజాల్‌	471/1	12
బాచుపల్లి	39,40	70

దశలవారీగా వేలం నిర్వహించనున్న స్థలాలు

గ్రామం	సర్వే నంబర్‌	చదరపు గజాలు
బైరామల్‌గూడ	57	2420
కోకాపేట్‌	144	8591
చందానగర్‌	174	484
పుప్పాలగూడ	146	1400
బాచుపల్లి	363	2299
బౌరంపేట్‌	694	2420
బౌరంపేట్‌	130	530
బౌరంపేట్‌	130	1500
బౌరంపేట్‌	130	666
చెంగిచెర్ల	33/1	1210
సూరారం	166/167	4840

చికిత్సపొందుతూ యువకుడి మృతి

నందిగామ: బైక్‌ నడుపుతూ రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని చేగూరులో మంగళవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ ప్రసాద్‌ కథనం ప్రకారం.. షాబాద్‌ మండలం మద్దూరుకు చెందిన ఇటుకల కిరణ్‌(19) తన స్నేహితుడు నరేశ్‌తో కలిసి సోమవారం రాత్రి 11:30 గంటల సమయంలో బైక్‌పై నందిగామ మండలం చేగూరు మీదుగా కొత్తూరుకు వెళ్తుండగా బైక్‌ అదుపుతప్పి, రోడ్డు పక్కన పంట పొలాలకు వేసిన ప్రీకాస్ట్‌ ప్రహరీని ఢీకొట్టారు. ఉస్మానియాలో చికిత్స పొందుతున్న కిరణ్‌ మంగళశారం మృతిచెందాడు. మృతుడి తండ్రి రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ప్రసాద్‌ తెలిపారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

నందిగామ: భార్యాభర్తల మధ్య జరిగిన చిన్నపాటి ఘర్షణతో మనస్తాపానికి గురైన ఓ మహిళ ఉరేసు కుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన ఈదులపల్లిలో సోమవారం చోటుచేసుకోగా మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్‌ ప్రసాద్‌ వివరాల ప్రకారం..ఆదిలాబాద్‌ జిల్లా నార్నూర్‌ మండలం చిట్టగూడకు చెందిన ధుర్వత రాణి(21), ఇదే గ్రామానికి చెందిన రాజ్‌కుమార్‌ భార్యభర్తలు. వీరు రెండేళ్ల క్రితం బతుకు దెరువు నిమిత్తం ఈదులపల్లికి వలస వచ్చి, స్థానికంగా ఓ ఫాంహౌస్‌లో పనిచేస్తున్నారు. వీరిమధ్య గత సోమవారం డబ్బుల విషయంలో గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెంది న రాణి భర్త బయటకు వెళ్లిన సమయంలో ఇంట్లో ని వాష్‌రూంలో చున్నీతో ఉరేసుకుంది. తోటి కూ లీల సాయంతో ఆమెను చికిత్స నిమిత్తం షాద్‌నగర్‌ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలి తల్లి సుశీలాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్‌ ప్రసాద్‌ తెలిపారు.

అవయవదానంపై అవగాహన

ఇబ్రహీంపట్నం: మోహన్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్‌ ప్రతినిధి వెంకటేశ్‌, ప్రిన్సిపల్‌ రాధిక మాట్లాడుతూ.. అవయవదానం చేస్తే నలుగురికి ప్రయోజనం చేకూరడంతోపాటు ప్రాణదానం చేసిన వారవుతారని అన్నారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ సురేష్‌, అధ్యాపకులు పాల్గొన్నారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌ కేసులో ఇద్దరికి జైలు

మోమిన్‌పేట: మద్యం సేవించి వాహనం నడిపిన ఇద్దరు వ్యక్తులకు న్యాయస్థానం మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ అరవింద్‌ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రం మోమిన్‌పేటకు చెందిన అరిగే ఉదయ్‌కుమార్‌, కుడుగుంట విజయ్‌ మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. దీంతో వీరిని వికారాబాద్‌ మార్నింగ్‌ కోర్టు జడ్జి ఎదుట హాజరుపర్చగా.. మూడు రోజుల జైలు శిక్షతో పాటు రూ.3 వేల చొప్పున జరిమానా విధించారన్నారు. ఎవరూ మద్యం సేవించి వాహనాలు నడుపకూడదని హెచ్చరించారు.

కేబుల్‌ వైర్లు కట్‌

మూగబోయిన టీవీలు

నిలిచిపోయిన ఇంటర్నెట్‌

- ఇబ్బందుల్లో వినియోగదారులు
- ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి
- రామంతాపూర్‌, అంబర్‌పేట్‌, బండ్లగూడ దుర్ఘటనలతో చర్యలు


ఎల్బీనగర్‌లో..


జీడిమెట్ల డివిజన్‌ అయోధ్యనగర్‌లో తొలగించిన కేబుల్‌ వైర్లను తరలిస్తున్న సిబ్బంది

సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్‌ స్తంభాలకు వేలాడుతూ నగరవాసుల మృత్యువాతకు కారణమవుతున్న స్టార్‌ కేబుళ్లు, ఇంటర్నెట్‌ కేబుళ్ల తొలగింపు ప్రక్రియను రెండో రోజైన మంగళవారం కూడా చేపట్టారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు దక్షిణ తెలంగాణ విద్యుత్‌ పంపిణీ సంస్థ ఇంజినీర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి, విద్యుత్‌ స్తంభాలకు ప్రమాదకరంగా మారిన కేబుళ్లను తొలగించారు. ఎలాంటి ముందస్తు హెచ్చరికలు లేకుండా అకస్మాత్తుగా టీవీ కేబుళ్లతో పాటు ఇంటర్నెట్‌ కేబుళ్లను కూడా తొలగించడంతో వినియోగదారులు ఇబ్బందుల పాలయ్యారు. ఇంట్లో టీవీ ప్రసారాలతో పాటు ఇంటర్నెట్‌ సేవలు కూడా నిలిచిపోవడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాల్సి వచ్చింది. ఇళ్ల నుంచి పని చేసే ఉద్యోగులకు ఇబ్బందులు తప్పలేదు.

వరుస ఘటనలతో సర్కారు సీరియస్‌

ఏదైనా స్తంభం నుంచి కేబుల్‌ లాగాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలి. ఒక్కో స్తంభానికి రూ.50 నుంచి రూ.100 వరకు ఫీజు చెల్లించాలి. కేబుళ్లు 15 ఫీట్ల ఎత్తులో అమర్చుకోవాలి. కానీ.. మెజార్టీ కేబుళ్లు పది అడుగుల ఎత్తులోనే కన్పిస్తున్నాయి. సపోర్టింగ్‌ వైరు, కేబుల్‌ గరిష్ఠ బరువు మీటర్‌కు 200 గ్రాములకు మించరాదు. స్తంభానికి స్తంభానికి మధ్య తీగల పొడవు 50 మీటర్లు మించరాదు. కానీ.. చాలా చోట్ల కేజీల కొద్దీ బరువున్న తీగలను చుట్టారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే జంక్షన్‌ బాక్సులకు కరెంట్‌ వాడుతున్నారు. కనీసం నెలవారీ బిల్లు చెల్లించడం లేదు. ఏ ఒక్క చోట కూడా మీటర్‌ ఉండదు. కానీ యథేచ్ఛగా విద్యుత్‌ను వాడుతుంటారు. నగరంలో ఈ తరహా కంపెనీలు 28కి పైగా ఉన్నట్లు అంచనా. ఆయా కేబుల్‌ ఆపరేటర్లతో ఇప్పటికే డిస్కం సీఎండీ ముషారఫ్‌ ఫరూఖీ సమావేశమై..స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. స్థానిక నేతలు, ప్రభుత్వంలోని కొంత మంది పెద్దలతో ఒత్తిడి తీసుకొచ్చి, తొలగింపు ప్రక్రియను విస్మరించారు. తాజాగా రామంతాపూర్‌, అంబర్‌పేట్‌, బండ్లగూడ వరుస ఘటనలతో ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకుంది. సోమవారం మధ్యాహ్నం నుంచి కేబుళ్ల తొలగింపు ప్రక్రియ ప్రారంభించినప్పటికీ.. రెండో రోజైనా మంగళవారం మరింత వేగవంతం చేసింది.

విగ్రహాల తరలింపుపై అప్రమత్తంగా ఉండాలి

గణేష్‌ విగ్రహాల తరలింపు విషయంలో అప్రమత్తంగా ఉండాలని దక్షిణ తెలంగాణ విద్యుత్‌ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్‌ ఫరూఖీ నిర్వాహకులకు సూచించారు. రామంతాపూర్‌, బండ్లగూడ, అంబర్‌పేట ఘటనల్లో విద్యుత్‌ అధికారుల తప్పిదం లేదని స్పష్టం చేశారు. ఇతర కారణాలే ఇందుకు కారణమని తెలిపారు. ఇప్పటికే ప్రమాదకరంగా మారిన ఎల్‌టీ, హెచ్‌టీ కేబుళ్లను గుర్తించి, వాటి స్థానంలో ఏబీ కేబుల్‌ ఏర్పాటు ప్రక్రియను ముమ్మరం చేసినట్లు తెలిపారు.

విగ్రహాల తరలింపులో జాగ్రత్తలు తప్పనిసరి

- విగ్రహాల ఎత్తును బట్టి రూట్‌ను ఎంచుకోవాలి. ఒకవేళ ఎక్కడైనా సమస్య ఉంటే విద్యుత్‌ సిబ్బందికి తెలియజేయాలి.
- విద్యుత్‌ లైన్ల నుంచి కనీసం రెండు అడుగుల దూరం పాటించాలి. లైన్‌లో ప్రవహించే విద్యుత్‌ సరఫరా ప్రభావం /ఇండక్షన్‌ ఉంటుంది.
- క్రేన్లు, ట్రక్కులు, ఎత్తైన మెటల్‌ విగ్రహాల తరలింపులో అప్రమత్తంగా ఉండాలి.
- మెటల్‌ ఫ్రేమ్‌లతో కూడిన డెకరేషన్లను వీలైనంత వరకు తగ్గించాలి.
- మండపాలకు విద్యుత్‌ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలి. సామాన్యులు విద్యుత్‌ స్తంభాలు ఎక్కకూడదు. సంస్థ సిబ్బంది ద్వారానే కనెక్షన్‌ తీసుకోవాలి.
- మండపాల్లో విద్యుత్‌ పనులు చేసేప్పుడు పరిసరాలను పూర్తిగా పరిశీలించాలి. విద్యుత్‌ తీగలు, స్తంభాలు, ఇతర ప్రమాదకర పరికరాల నుంచి పిల్లల్ని దూరంగా ఉంచాలి.
- వైరింగ్‌లో లీకేజీలు లేకుండా చూసుకోవాలి. వర్షానికి తేమతో షాక్‌ కొట్టే ప్రమాదం ఉంది. అత్యవసర పరిస్థితుల్లో 1912 కాల్‌ సెంటర్‌కు ఫోన్‌ చేయాలి.